సాక్షి
కర్నూలు
బుధవారం । 15 । అక్టోబర్ । 2025



టిమ్స్..కిమ్స్..నిమ్స్ ఉత్తుత్తేనా!
పదేళ్ల క్రితం కర్నూలు పెద్దాసుపత్రిని రిమ్స్, కిమ్స్, టిమ్స్‌గా మారుస్తామని చంద్రబాబు మాట ఇచ్చి మరిచారు. ఇప్పుడు ప్రధాని పర్యటనలోనైనా అభివృద్ధిపై దృష్టి సారిస్తారో లేదో చూడాలి. IIలో▸



భారీ వాహన రాకపోకలపై నిషేధం
ప్రధాని మోదీ ఈనెల 16న కర్నూలు పర్యటన నేపథ్యంలో కర్నూలు మీదుగా వెళ్లే భారీ వాహనాల రాకపోకలపై నిషేధం విధించినట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. IIలో▸



కూలీల వాహనాలు బోల్తా
గడివేముల మండలం పెసరవాయి రస్తాలో అదుపుతప్పి ఓ బొలేరా వాహనం, ఆటో బోల్తా పడిన ఘటనలో దాదాపు 20 మంది కూలీలు గాయపడ్డారు. IIలో▸

న్యూస్‌రీల్

వడ్డీరేట్లు భారీగా తగ్గింపు


భాస్కరవర్మ
చీఫ్ మేనేజర్, ఎస్‌బీఐ

కర్నూలు(అగ్రికల్చర్): స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా వెహికల్, పర్సనల్ లోన్‌లపై వడ్డీ రేట్లు తగ్గించిందని, ఈ అవకాశాన్ని ఉద్యోగులు, ఇతర వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ట్రెజరీ శాఖ చీఫ్ మేనేజర్ భాస్కర వర్మ తెలిపారు. కారు లోన్‌లపై ఇప్పటి వరకు 9.45 శాతం వడ్డీ రేటు ఉందని, దీనిని 8.75 శాతానికి తగ్గించినట్లు మంగళవారం విలేకర్లకు తెలిపారు. పర్సనల్ లోన్‌లపై వడ్డీరేటు 13.50 వరకు ఉండగా.. దీనిని 10.75 శాతానికి తగ్గించామన్నారు. ఈ రుణాల మంజూరుకు ఎలాంటి ప్రాసెసింగ్ ఫీజు ఉండదన్నారు. ఈ అవకాశం పర్సనల్ లోన్‌లకు సంబంధించి నవంబరు నెల చివరి వరకు, కారు లోన్‌లు డిసెంబర్ చివరి వరకు మాత్రమే అవకాశం ఉందన్నారు.

అన్నా చెల్లెలు టీచర్లు.. ఒకే పాఠశాలలో విధులు


హుసేనాపురం ఉర్దూ పాఠశాలలో విధుల్లో చేరిన అన్నాచెల్లెలు

తుగ్గలి: ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైన అన్నా చెల్లెలు చివరకు ఒకే పాఠశాలలో పోస్టింగ్ పొందారు. ఆత్మకూరుకు చెందిన బాలస్వామి (హెచ్‌ఎం), నాగమణి దంపతుల కుమారుడు, శ్యామ్యూల్ రాజు, కుమార్తె సారాపింకి కొత్తగా ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందారు. ఒకేసారి ఉద్యోగాలు పొందడమే కాకుండా ఒకే పాఠశాలలో టీచర్లుగా చేరడం విశేషం. మండలంలోని హుసేనాపురం ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయులుగా మంగళవారం విధుల్లో చేరారు. వీరి సోదరి మౌనిక కూడా అమలాపురంలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నట్లు శ్యామ్యూల్ రాజు, సారాపింకి తెలిపారు. ఒకే పాఠశాలలో ఇద్దరం విధుల్లో చేరడం ఆనందంగా ఉందని, విద్యార్థులను తీర్చిదిద్దుతామన్నారు.

నేటి నుంచి విద్యుత్ ఉద్యోగుల నిరవధిక సమ్మె

కర్నూలు(అగ్రికల్చర్): వివిధ డిమాండ్‌లను సాధించుకునేందుకు చేపట్టిన పోరాటాన్ని విద్యుత్ ఉద్యోగులు మరింత తీవ్రం చేయనున్నారు. మంగళవారం వర్క్‌టురూల్ చేపట్టారు. నిర్ణీత పనివేళలకు విధులకు హాజరై నిర్ణీత సమయానికి వెళ్లారు. ఇటు కూటమి ప్రభుత్వం నుంచి అటు విద్యుత్ సంస్థల నుంచి స్పందన లేకపోవడంతో ఈ నెల 15 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నట్లు మంగళవారం సాయంత్రం ఏపీ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఉమ్మడి జిల్లా చైర్మన్ సతీష్‌కుమార్ తెలిపారు.

23 సంఘాలతో జేఏసీ ఏర్పాటు
డిమాండ్‌ల సాధనకు ఏపీ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటైంది. ఇందులో 1104,327, డిప్లమా ఇంజినీర్స్, బీసీ, ఓసీ, బహుజన ఉద్యోగ సంఘాలు మొత్తం 23 సంఘాలు జేఏసీలో ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో దాదాపు 4వేల మంది విద్యుత్ ఉద్యోగులు పని చేస్తున్నారు. ఏఈఈ(బీటెక్) నుంచి ఏడీఈలు, డీఈఈ, ఎస్ఈఈ, ఇతర గెజిటెడ్ అధికారులు మాత్రం సమ్మెలో ఉండరని సమాచారం.

అతీగతీ లేని బీజేపీ రాయలసీమ డిక్లరేషన్

- ఎనిమిదేళ్ల క్రితం ప్రకటన చేసినా సాధించింది శూన్యం
- 11ఏళ్లుగా కేంద్రంలో ఉన్నా సీమకు చేసిన మేలు ఒక్కటీ లేదు
- హైకోర్టు ఏర్పాటు, రెండో రాజధాని ఏర్పాటుపై నోరు మెదపని బీజేపీ
- ఊసేలేని గుంతకల్లు రైల్వే జోన్, కడప స్టీల్ ప్లాంట్
- విభజన హామీల్లో రాయలసీమకు మొండిచేయి
- ఉమ్మడి జిల్లాలో రేపు ప్రధాని మోదీ పర్యటన

మాటల్లో కట్టుబడి చేతల్లో వెనుకబడి!

రాయలసీమ డిక్లరేషన్‌లో ముఖ్యమైన డిమాండ్లు..

- కేవలం గుంటూరు-కృష్ణా జిల్లాల పార్టీ అన్నట్లుగా అప్పట్లో బీజేపీ నిర్ణయాలు ఉండడంతో 2018 ఫిబ్రవరి 23న రాష్ట్ర శాఖ రాయలసీమ డిక్లరేషన్‌ను ప్రకటించింది.
- రాయలసీమలో ఏపీ రెండో రాజధానిని ఏర్పాటు చేయాలి. ఇందుకోసం వెంటనే ప్రకటన చేసి భూసేకరణ చేయాలి.
- ఏపీ అసెంబ్లీ భవనం నిర్మించి ప్రతి ఆరునెలలకు ఒకసారి కర్ణాటక, మహారాష్ట్ర తరహాలో అసెంబ్లీ సమావేశాల నిర్వహణ.
- సెక్రటేరియట్‌తో పాటు మరికొన్ని ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు.
- గవర్నర్ తాత్కాలిక విడిది నివాసంతోపాటు కర్నూలులో పూర్తి స్థాయిలో హైకోర్టును ఏర్పాటు. అప్పట్లో ఏర్పాటయ్యే తాత్కాలిక హైకోర్టునే నేరుగా కర్నూలులో ఏర్పాటు చేయాలని స్పష్టం.
- రాయలసీమకు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 2018-19 బడ్జెట్‌లో జనాభా ప్రతిపాదికన నిధుల కేటాయింపు. గత బడ్జెట్‌లో జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు ప్రత్యేకంగా నిధులు.
- రాయలసీమ ప్రాంతీయ బోర్డును ఏర్పాటు చేసి రూ.20 వేల కోట్లు కేటాయింపు.
- సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణకు రూ.10 వేల కోట్లు.
- రాయలసీమను 8 జిల్లాలుగా ప్రకటించాలి. గుంతకల్ రైల్వేజోన్‌ను ఏర్పాటు చేయాలి. కడప స్టీలు ఫ్యాక్టరీ నిర్మాణం.



కర్నూలు(సెంట్రల్): వెనుకబడిన రాయలసీమపై బీజేపీ పగబట్టింది. రాయలసీమ డిక్లరేషన్‌ను ఘనంగా ప్రకటించినా అమలులో మీనమేషాలు లెక్కిస్తోంది. కేంద్రంలో 11 ఏళ్లుగా అధికారంలో ఉన్నా.. రాష్ట్రంలోనూ అధికార పక్షంలో భాగస్వామిగా ఉన్నా రాయలసీమ డిక్లరేషన్ ఒక్క అడుగు కూడా ముందుకు పడని పరిస్థితి. ఆ పార్టీ నేతలు డిక్లరేషన్‌కు కట్టుబడి ఉన్నామని చెప్పడం తప్పిస్తే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొస్తున్న దాఖలాలు లేవు. ఫలితంగా డిక్లరేషన్ ప్రకటించి 8 ఏళ్లు గడుస్తున్నా ఒక్క డిమాండ్ కూడా నెరవేరకపోవడం గమనార్హం. ఫలితంగా ఇక్కడి శ్రామికులు ఉపాధి కోసం ఇతర నగరాలకు వలస వెళ్తున్నారు. నిరుద్యోగులు పొట్టచేత పట్టుకొని నగరాల్లో దినదిన గండంగా జీవనం సాగిస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ రేపు(గురువారం) రాయలసీమ ముఖద్వారమైన కర్నూలుకు రానున్న నేపథ్యంలో బీజేపీ డిక్లరేషన్‌పై ఓ ప్రకటన చేసి వెనుకబడిన రాయలసీమను వృద్ధిలోకి తీసుకురావాలనే అభిప్రాయం సర్వత్రా వినిపిస్తోంది.

న్యాయ రాజధానిపై మౌనం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాయలసీమలో న్యాయ రాజధాని ఏర్పాటుకు నిర్ణయించారు. దీనిపై అప్పట్లో అసెంబ్లీలో ఆ పార్టీ ఎమ్మెల్సీగా ఉన్న విష్ణుకుమార్‌రాజు సమర్థించారు. అయితే తరువాత ఆయనతో సహా అమరావతే రాజధాని ఉండాలని పట్టుబట్టారు. కాగా, కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటైతే ఏపీ హైకోర్టు సహా పలు న్యాయ సంస్థలు ఇక్కడికి వచ్చేవి. గవర్నర్, సీఎం కర్నూలుకు వచ్చి వెళ్లే పరిస్థితి ఉండటంతో క్యాంపు ఆఫీసులు వెలిసేవి. న్యాయ రాజధానికి బీజేపీ ఒప్పుకుని ఉంటే ఆ పార్టీ డిక్లరేషన్‌లో దాదాపు 90 శాతం డిమాండ్లు నెరవేరేవి. కాగా, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలోనే రాయలసీమ 8 జిల్లాలుగా విస్తరించడంతో ఆ ఒక్క డిమాండ్ మాత్రమే రాయలసీమ డిక్లరేషన్‌లో పూర్తి స్థాయిలో అమలైనట్లయింది.

"రాయలసీమ డిక్లరేషన్‌కు కట్టుబడి ఉన్నాం..
- ఇటీవల కర్నూలు పర్యటనలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

వాస్తవానికి బీజేపీ రాయలసీమ డిక్లరేషన్ ప్రకటించి ఎనిమిదేళ్లు అవుతోంది. ఆ పార్టీ 11 ఏళ్లుగా కేంద్రంలో ఉన్నా ఇప్పటి వరకు డిక్లరేషన్ ఒక్క అడుగు కూడా ముందుకు కదలకపోవడం ఈ ప్రాంతంపై ఆ పార్టీ చిత్తశుద్ధికి అద్దం పడుతోంది.

ఈ పరిస్థితి చూస్తుంటే.. రాయలసీమ డిక్లరేషన్‌కు బీజేపీ కేంద్ర పెద్దల ఆమోదం లేదని గతంలో చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యలే నిజమయ్యేలా కనిపిస్తున్నాయి.

రాయలసీమ డిక్లరేషన్‌పై మోదీ మాట్లాడుతారా? లేదా?



బీజేపీ రాయలసీమ డిక్లరేషన్ ప్రకటించి 8 ఏళ్లైనా ఏనాడు కేంద్ర పెద్దలు దానిపై కనీస ప్రకటన చేయలేదు. అయితే ప్రధానమంత్రే రాయలసీమకు వస్తుండడంతో దానిపై ఏమైనా మాట్లాడుతారా, లేదా అనే చర్చ జరుగుతోంది. మాట్లాడితే రాష్ట్ర బీజేపీ నాయకులు ఇన్నాళ్లుగా పెద్దల అనుమతి ఉంటుందన్న అభిప్రాయానికి బలం చేకూరుతుంది. లేదంటే ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నట్లు బీజేపీ దొంగ నాటకం బట్టబయలు కానుంది.

• విభజన చట్టం అమలేది?

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రాయలసీమకు తీవ్ర అన్యాయం చేస్తోంది. ఏపీ విభజన చట్టం హామీలను అమలు చేయలేదు. వెనుకబడిన ప్రాంతాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీని అమలు చేయాల్సి ఉన్నా విస్మరించారు. కేవలం మూడేళ్లపాటు ఒక్కో జిల్లాకు రూ.50 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకుంది. కడప స్టీల్ ప్లాంటును ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నా పట్టించుకోని పరిస్థితి. అదే జరిగితే వెనుకబడిన రాయలసీమలోని నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగావకాశాలు లభిస్తాయి. గుంతకల్ రైల్వేజోన్‌ను ప్రకటించినా కనెక్టివిటీ పెరిగి అభివృద్ధికి నాంది పడే అవకాశాలు ఉన్నాయి. ప్రాంతీయ బోర్డు ఏర్పాటు చేసి రూ.20 వేల కోట్లు కేటాయిస్తే సీమలో నిరుద్యోగం ఉండదు. కార్మికులు, కర్షకులకు ఉపాధి దొరికి వలసలను నివారించవచ్చు.



సాగునీటి రంగానికి తీవ్ర అన్యాయం



బీజేపీ డిక్లరేషన్‌లో పెండింగ్ ప్రాజెక్టులకు రూ.10 వేల కోట్లు కేటాయించాలని పెట్టారు. ఆ నిధుల ద్వారా సిద్దేశ్వరం అలుగు, గుండ్రేవుల, వేదవతితో రాయలసీమను సస్యశ్యామలం చేయవచ్చన్నది వారి ఆలోచన. అయితే అందుకు సంబంధించిన నిధులను కేటాయించడంలో విఫలం కావడంతో రాయలసీమ రైతాంగానికి తీరని అన్యాయం జరుగుతోంది. వర్షాలు సమృద్ధిగా పడినా సముద్రం పాలవుతున్నాయి. వర్షపు నీటిని ఒడిసి పట్టుకునే పరిస్థితి లేకపోవడంతో కళ్లెదుటే నీళ్లున్నా పొలాల్లో కన్నీళ్లు పారుతున్నాయి.

సీమలోని పారిశ్రామిక వాడలను ఆదుకోవాలి...



రాయలసీమలోని ఓర్వకల్లు(కర్నూలు), కొప్పర్తి(వైఎస్ఆర్)లలో పారిశ్రామిక వాడలు ఉన్నాయి. వాటిని వృద్ధిపథంలోకి తేవడానికి కేంద్రం చేయూత ఎంతో అవసరం. అయితే ఆ దిశగా కేంద్రం చర్యలు తీసుకోవడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ పార్కులో 10 వేల ఎకరాలతో ల్యాండ్ బ్యాంకును ఏర్పాటు చేసినా మౌలిక వసతుల కల్పనలో విఫలంతో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ముందుకు రావడంలేదు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పారిశ్రామికవాడలపై దృష్టి సారించాల్సి ఉంది.

నిధులు, నీళ్లు కావాలి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయలసీమకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయి. పెండింగ్‌లోని సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించడం లేదు. బీజేపీ రాయలసీమ డిక్లరేషన్ ప్రకటించి 8 ఏళ్లు అయినా ఒక్క డిమాండ్‌నూ నెరవేర్చలేదు. ఒక్క ప్రాజెక్టును కూడా కట్టలేదు. రాయలసీమలో హైకోర్టును ఏర్పాటు చేస్తామన్నా అమలుకు నోచుకోలేదు. 11ఏళ్లుగా జీఎస్టీ భారం మోపుతున్న మోదీ ఇప్పుడు కొసరులో పీసరు తగ్గించి సంబరాలకు రావడం అన్యాయం.

– కె.ప్రభాకరరెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు, కర్నూలు

అంకితభావంతో విధులు నిర్వహించాలి


సమీక్ష నిర్వహిస్తున్న సీఎఫ్ కృష్ణమూర్తి, చిత్రంలో డీఎఫ్‌వో శ్యామల

కర్నూలు కల్చరల్: అటవీ శాఖ ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వహించాలని ఆ శాఖ కర్నూలు సర్కిల్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఐఎఫ్ఎస్ బీవీఏ కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం ఆయన డీఎఫ్‌వో శ్యామలతో కలిసి కర్నూలు డివిజన్ ఎఫ్ఆర్‌వో, డీఆర్‌వోలతో సమీక్ష నిర్వహించారు. కర్నూలు నగరవనం, విజయ వనం, పుల్లయ్య పార్క్‌లను అభివృద్ధి చేయాలన్నారు. వివిధ స్కీంల ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. గడువులోగా పనులు పూర్తి చేయాలన్నారు. అటవీ భూముల ఆక్రమణలను అడ్డుకోవాలని, వన్యప్రాణులను సంరక్షించాలని ఆదేశించారు. ఉద్యోగులు విధులు నిర్వహించే చోటే నివాసం ఉండాలని, వేరో చోట ఉంటే చర్యలు తప్పవన్నారు. సర్కిల్ కార్యాలయం ఏవో అబ్దుల్ సుభాన్, కర్నూలు ఏవోలు మహమ్మద్ హుసేన్, చంద్రశేఖర్, ఫ్లయింగ్ స్క్వాడ్ రేంజ్ అధికారి రమణారెడ్డి, ఎఫ్ఆర్‌వోలు విజయకుమార్, తేజస్వి, డీఆర్‌వోలు ఓబులేసు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

రానున్న ఐదు రోజుల్లో వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): రానున్న ఐదు రోజుల్లో ఉమ్మడి జిల్లాలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు ప్రకటించారు. ఈ నెల 15 నుంచి 19 వరకు కర్నూలు, నంద్యాల జిల్లాలకు వర్షసూచన ఉందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 15న 12.2 మి.మీ, 16న 3.7 మి.మీ, 17న 5.1 మి.మీ, 18న 1.6 మి.మీ, 19న 4.3 మి.మీ వర్షపాతం నమోద య్యే అవకాశం ఉందని తెలిపారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 32.8 నుంచి 33.9 డిగ్రీలు నమోదు అయ్యే అవకాశం ఉందన్నారు. కాగా మంగళవారం సాయంత్రం నుంచి కర్నూలు నగరంతో పాటు వివిధ ప్రాంతాల్లో వర్షం కురిసింది.

డెంగీతో చిన్నారి మృతి?


మృతిచెందిన కావ్య

పత్తికొండ : డెంగీ జ్వరంతో చిన్నారి మృతి చెందిన సంఘటన మంగళవారం పత్తికొండ పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని కొండగేరికి చెందిన శ్రీలక్ష్మి, రవి దంపతుల పెద్ద కుమార్తె కావ్య(7) రెండు రోజుల నుంచి తీవ్రమైన జ్వరంతో బాధపడుతుండటంతో సోమవారం పత్తికొండ ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. అనంతరం అక్కడ వైద్యులు చికిత్స నిర్వహించి రక్తకణాలు పూర్తిగా తగ్గిపోవడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. బాలిక తల్లిదండ్రులు వెంటనే కర్నూలు ప్రభుత్వ అసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి కోలుకోలేక మంగళవారం మృతి చెందింది. చిన్నారి మృతితో బాలిక కుటుంబీకుల రోదనలతో పలువురు కంటతడి పెట్టారు.

కర్నూలుకు ఏపీ డీజీపీ


డీజీపీకి స్వాగతం పలుకుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు: ప్రధానమంత్రి నరేంద్రమోదీ కర్నూలు పర్యటన నేపథ్యంలో భద్రత ఏర్పాట్లను ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్త పర్యవేక్షించారు. శ్రీశైలం నుంచి మంగళవారం మధ్యాహ్నం కర్నూలు బి.క్యాంప్‌లోని పోలీసు అతిథి గృహానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆయనకు మర్యాదపూర్వకంగా పూలబొకే ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం నన్నూరు రాగమయూరి గ్రీన్ హిల్స్ వద్ద ఏర్పాటు చేసిన కమాండెంట్ కంట్రోల్ రూమ్‌కు చేరుకుని ప్రధానమంత్రి పర్యటన సందర్భంగా సెక్యూరిటీ పరంగా తీసుకుంటున్న జాగ్రత్తలను అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. డీఐజీ కోయ ప్రవీణ్, ఐపీఎస్ అధికారులు శ్రీకాంత్, మధుసూదన్ రెడ్డి, సెంథిల్, గోపీనాథ్ జెట్టి, ఫక్కీరప్ప తదితరులతో సమీక్షించారు.

రెండు రోజులు విద్యా సంస్థలకు సెలవు

కర్నూలు కల్చరల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 16న జిల్లా పర్యటన నేపథ్యంలో విద్యా సంస్థలకు బుధవారం, గురువారం రెండు రోజుల పాటు సెలవు ప్రకటించినట్లు డీఈవో శామ్యూల్ పాల్, డీవీఈవో, ఆర్ఐవో లాలెప్ప వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, అనుబంధ జూనియర్ కళాశాలలకు సెలవులు ప్రకటించినట్లు ఇంటర్మీడియెట్ విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. ఇదిలాఉంటే పీఎం సభకు ప్రజలను తరలించేందుకు జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలకు చెందిన బస్సులను మళ్లిస్తున్నారు. ఆర్టీవో ఆఫీస్ నుంచి అన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.

శ్రీగిరి అభివృద్ధికి ఆమోదీంచేనా!



- రేపు శ్రీశైలం రానున్న భారత ప్రధాని నరేంద్ర మోదీ
- శ్రీగిరి అభివృద్ధికి బాటలు పడేనా?
- కలగా మిగిలిన శ్రీశైలానికి రైలు మార్గం
- క్షేత్రానికి 5,300 ఎకరాల భూ బదిలీ జరిగేనా
- ఆత్మకూరు-దోర్నాల ఘాట్‌రోడ్డు విస్తర్ణకు ఆమోదం లభించేనా?
- గతంలో కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ స్కీం నుంచి రూ.43 కోట్లు విడుదల

శ్రీశైలంటెంపుల్: ఆది దంపతులైన పార్వతీ పరమేశ్వరులు శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వరూపంలో కొలువైన ఆధ్యాత్మిక క్షేత్రం శ్రీశైల మహాక్షేత్రం. దేశంలో ఎక్కడా లేని విధంగా ఒకే ప్రాంగణంలో జ్యోతిర్లింగ స్వరూపుడు, శక్తిపీఠం కలగలసి వెలసి ఉన్న ఏకైక క్షేత్రం. అంతటి ప్రాశస్త్యం ఉన్న మహాక్షేత్రం అభివృద్ధికి దూరమవుతోంది. అరకొర సాకర్యాలతో భక్తులు అవస్థలు పడుతున్నారు. క్షేత్రంలో ఏ చిన్న అభివృద్ధి చేయాలన్న అటవీశాఖ నుంచి అడ్డంకులు ఎదురవుతున్నాయి. రహదారులు, వసతి సౌకర్యాలు భక్తులను వేధిస్తున్నాయి. గురువారం శ్రీశైలానికి భారత ప్రధాని మోదీ వస్తున్న నేపథ్యంలో క్షేత్ర అభివృద్ధిపై దృష్టి సారించి, శ్రీగిరిలో నెలకొన్న సమస్యలపై దృష్టిసారించి పరిష్కరించాలని భక్తులు కోరుతున్నారు. ఈ క్షేత్రానికి చేరుకోవాలంటే అటు ఆంధ్రా నుంచి అయినా, ఇటు తెలంగాణ ప్రాంతం నుంచి అయినా రైలు మార్గం లేదు. సుమారు 80 కిలోమీటర్ల దూరంలోని మార్కాపురం రోడ్డు వరకు మాత్రమే రైలు మార్గం ఉంది. ఇటు తెలంగాణ నుంచి అయితే రైలు మార్గం అసలే లేదు. గతంలో పార్లమెంట్‌సభ్యులు శ్రీశైలానికి రైలు మార్గం ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విన్నవించడంతో పరిశీలించాలని అధికారులకు ఆదేశించింది. కేంద్రం ఆదేశాలతో ప్రత్యేక కమిటీ సభ్యులు శ్రీశైలానికి రైలు మార్గానికి ఉన్న అవకాశాలను పరిశీలించారు. శ్రీగిరి చుట్టూ నల్లమల అభయారణ్యం కావడంతో మార్కాపురం రోడ్డు నుంచి దోర్నాల వరకు రైలు మార్గాన్ని విస్తరించవచ్చునని ప్రతిపాదనలను పంపినట్లు సమాచారం. అయితే ఏటా బడ్జెట్ ప్రవేశపెట్టేటప్పుడు శ్రీశైలానికి రైలు మార్గం బడ్జెట్‌లో ప్రస్తావనకు రావడం లేదు. క్షేత్రానికి రైలు మార్గం ఉంటే సామాన్య భక్తులు సైతం క్షేత్ర యాత్ర చేసుకునే అవకాశం ఉంటుంది.

ఘాట్‌రోడ్డు విస్తరించేనా:



శ్రీశైల క్షేత్రానికి ఏపీ, అటు తెలంగాణ నుంచి చేరుకోవాలంటే సుమారు 100 కి.మీ దూరం ఘాట్ రోడ్డులో రోడ్డు ప్రయాణం చేయాలి. ఏపీ వైపు శ్రీశైలం నుంచి ఆత్మకూరు వైపు సుమారు 100 కిలోమీటర్లు ఘాట్‌రోడ్డు సింగిల్ రోడ్డు మాత్రమే. వర్ష కాలంలో ఇరుకైన ఈ రోడ్డులో తరచూ భారీ వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్య నెలకొంటుంది. ఈ రోడ్డు నేషనల్ హైవే పరిధిలో ఉన్నప్పటికీ విస్తరించడం లేదు. ఆత్మకూరు నుంచి దోర్నాల, దోర్నాల నుంచి శ్రీశైలం నాలుగు లైన్లుగా విస్తరిస్తే క్షేత్రానికి భక్తుల రాకపోకలు మరింత పెరిగే అవకాశం ఉంది. అలాగే దోర్నాల-శ్రీశైలం నేషనల్ హైవే 765 పరిధిలో ఉంది. ఎన్‌హెచ్-765 రహదారిని విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.3వేల కోట్లతో చేపట్టేందుకు డీపీఆర్ సిద్ధం చేశారు. ఈ ప్రాంతంలో అండర్‌పాస్, ఓవర్ పాస్ బ్రిడ్జిలు నిర్మిస్తే వన్యప్రాణులు, పులుల సంచారానికి ఆటంకం లేకుండా, వన్యప్రాణులు వాహనాల ప్రమాదానికి గురికాకుండా ఉంటుందని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అలాగే లింగాలగట్టు నుంచి శ్రీశైలానికి ఆంధ్రా-తెలంగాణ ప్రాంతాలను కలుపుతూ సుమారు రూ.300కోట్లతో ఒక ఐకానిక్ బ్రిడ్జి నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

ఐకానిక్ బ్రిడ్జికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేనా?
శ్రీశైల దేవస్థానంలో విధులు నిర్వహించే ఉద్యోగులకు సున్నిపెంటగ్రామంలో సుమారు రూ.70 కోట్లతో స్టాఫ్ క్వాటర్స్ నిర్మించారు. సున్నిపెంట నుంచి శ్రీశైలానికి 10 కిలోమీటర్ల దూరం ఉంది. ఈ దూరాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో సున్నిపెంట నుంచి కృష్ణానదిపై శ్రీశైలం వరకు ఐకానిక్ బ్రిడ్జి నిర్మించాలని మాస్టర్‌ప్లాన్‌లో ప్రతిపాదించారు. అలాగే తెలంగాణ నుంచి శ్రీశైలంకు సమీపంలో దూరాన్ని తగ్గించేలా తెలంగాణ ప్రభుత్వం ఎలివేటెడ్ కారిడార్ నిర్మించేందుకు డీపీఆర్ సిద్ధం చేసి అనుమతుల కోసం కేంద్ర ప్రభుత్వానికి పంపారు. ఏపీ, తెలంగాణ ప్రతిపాదనలకు కేంద్ర ప్రభుత్వ అటవీశాఖ అధికారులు అనుమతులు ఇవ్వాలి. ఐకానిక్ వంతెనను నిర్మిస్తే భక్తులకు శ్రీశైలం దూరం తగ్గడంతో పాటు ప్రయాణం సాఫీగా సాగుతుంది.



భూ బదలాయింపు జరిగేనా
గతంలో దేవదాయ, అటవీ, రెవెన్యూ శాఖల మంత్రులు, మూడు శాఖల ఉన్నతాధికారులతో హైపవర్ కమిటీ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించి ప్రాథమికంగా శ్రీశైల దేవస్థానానికి 5,302 ఎకరాల భూమి ఉందని నిర్ధారించారు. శ్రీశైల దేవస్థానానికి 1967 నవంబర్‌లో ఫుడ్ అండ్ అగ్రికల్చరేట్ డిపార్ట్‌మెంట్ ప్రకారం 5,302 ఎకరాల భూమిని కేటాయించారు. ఈ మొత్తం భూమి 9 సర్వే నెంబర్లలో ఉంది. 5,302 ఎకరాల్లో 900 ఎకరాలు శ్రీశైలం ప్రాజెక్టు రిజర్వాయర్‌లో ముంపు అయింది. బ్రిటీష్‌కాలం నాటి జీవో, బ్రిటీష్ కాలం నాటి గెజిట్ ఎంట్రీ ద్వారా సర్వే చేయించి క్షేత్ర సరిహద్దులను గుర్తించారు. 4,400 ఎకరాలు శ్రీశైల మల్లన్నకు చెందిన భూమి అని గుర్తించి, అటవీశాఖ అంగీకరించింది. దీంతో ఆ భూమిని దేవస్థానానికి అప్పగించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున దేవదాయశాఖకు భూమిని అప్పగించేందుకు గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సర్వే డిపార్ట్‌మెంట్‌కు డీఎఫ్‌వో లేఖ రాశారు. అక్కడి నుంచి ఎటువంటి సమాధానం రాలేదు.

మల్లన్న క్షేత్రానికి 'ప్రసాదం' అందేనా..!

శ్రీశైల క్షేత్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ స్కీం రూ.43 కోట్లతో అభివృద్ధి చేసింది. శ్రీశైలక్షేత్రానికి రోజు రోజుకు పెరుగుతున్న భక్తులు, పర్యాటకుల సౌకర్యార్థం శ్రీశైలంలో కల్పించాల్సిన సౌకర్యాలపై 2017 లో అప్పటి ఈవో భరత్‌గుప్తా కేంద్ర పర్యాటక శాఖ అధికారులకు వివరించి, డీపీఆర్‌ను సమర్పించారు. దీంతో కేంద్ర పర్యాటక శాఖ (పిలిగ్రిమేజ్ రెజువెనేషన్ అండ్ స్పిర్చువల్ అగ్మెంటేషన్ డ్రైవ్) ప్రసాద్ పథకం కింద శ్రీశైల క్షేత్రంలో భక్తులకు, పర్యాటకులకు కల్పించాల్సి న సౌకర్యాల కోసం రూ.43 కోట్లు నిధులు మంజూరు చేసింది. మూడు విడతలుగా నిధులు మంజూరయ్యాయి. 2017లో శ్రీశైలంలో ప్రసాద్ పథకం ద్వారా పనులు ప్రారంభించారు. కేంద్రం మంజూరు చేసిన పనులను రాష్ట్ర పర్యాటక శాఖ, శ్రీశైల దేవస్థాన ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో చేపట్టారు. 2022 డిసెంబరు 26న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఆయా అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. మల్లన్న దర్శనానికి వస్తున్న భారత ప్రధాని నరేంద్ర మోదీ శ్రీగిరి అభివృద్ధికి వరాలు కురిపించాలని భక్తులు కోరుతున్నారు.

టిమ్స్‌..కిమ్స్‌..నిమ్స్‌ ఉత్తుత్తేనా!

- నాటి హామీలను గాలికొదిలిన చంద్రబాబు
- కర్నూలు జీజీహెచ్‌పై శీతకన్ను
- వైఎస్సార్‌సీపీ హయాంలో నాడు–నేడు కింద రూ.500 కోట్లతో పనులకు శ్రీకారం
- చివరి దశలో కూటమి ప్రభుత్వం రాకతో నిలిచిన పనులు


ఆసుపత్రిలో ఆగిపోయిన ఐపీ భవన నిర్మాణం

కర్నూలు(హాస్పిటల్‌): రాష్ట్ర విభజన అనంతరం జరిగిన ఎన్నికల్లో 2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం మొదటిసారి స్వాతంత్ర్య దినోత్సవాలను కర్నూలులో నిర్వహించింది. అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలను రిమ్స్‌(రాయలసీమ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ మెడికల్‌ సైన్సెస్‌)/కిమ్స్‌(కర్నూలు ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ మెడికల్‌ సైన్సెస్‌)/టిమ్స్‌(తుంగభద్ర ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ మెడికల్‌ సైన్సెస్‌)గా మారుస్తామని హామీ ఇచ్చారు. పదేళ్లయ్యింది. ఇప్పటిదాకా దీనికి ఎలాంటి అడుగూ పడలేదు. ఇప్పుడు ఏకంగా దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీని వెంటబెట్టుకుని కర్నూలు వస్తున్నారు. ఇప్పటికైనా కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అభివృద్ధిపై దృష్టి సారిస్తారా లేదా ఎప్పటిలాగే హామీలు ఇచ్చి వదిలేస్తారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రూ.22.70 కోట్లు ఇస్తే భవనాలు అందుబాటులోకి..

ఐపీ భవన నిర్మాణానికి రూ.60.5 కోట్లు ఖర్చు అయితే అప్పట్లో రూ.42 కోట్లు చెల్లించారు. ఇంకా రూ.18.5 కోట్లు పెండింగ్‌లో ఉంది. లెక్చరర్‌ గ్యాలరీకి, ఎగ్జామినేషన్‌ హాలుకు పనులు జరుగుతుండగానే బిల్లులు చెల్లించారు. ఎగ్జామినేషన్‌ హాలు పూర్తయి అందుబాటులోకి వచ్చింది. గత టీడీపీ ప్రభుత్వంలో ఆగిపోయిన డ్రగ్‌ కంట్రోల్‌ భవనానికి కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పూర్తి చేయించింది. కానీ ఈసారి కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.46 లక్షల బిల్లులు పెండింగ్‌ పెట్టింది. దీంతో కాంట్రాక్టర్‌ దానిని ఇంకా అప్పగించలేదు. ఐపీడీకి రూ.18.5కోట్లు, లెక్చరర్‌ గ్యాలరికి 2.95కోట్లు, ఎగ్జామినేషన్‌ హాలుకు రూ.79లక్షలు, డ్రగ్‌ కంట్రోల్‌ భవనానికి రూ.46 లక్షలు కలిపి మొత్తం రూ.22.70 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని చెల్లిస్తే భవనాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.


కేఎంసీలో 90 శాతం పనులు పూర్తయిన లెక్చరర్‌ గ్యాలరీ

కీలకంగా ఇన్‌పేషెంట్‌ భవనం

ఆసుపత్రిలో ఇన్‌ పేషెంట్‌ భవనం కీలకంగా మారింది. ఈ భవనం నిర్మాణం కోసం అప్పట్లో పాత భవనాలన్నీ ఖాళీ చేయించి వాటిని ఇతర వార్డుల్లో సర్దుబాటు చేశారు. 2023లో భవన నిర్మాణ పనులు శరవేగంగా జరిగాయి. ఆరు నెలల కాలంలోనే సెల్లార్‌, గ్రౌండ్‌ ఫ్లోర్‌, ఫస్ట్‌ఫ్లోర్‌ వరకు పిల్లర్లు, గోడలు లేచాయి. మరో ఏడాది ఉంటే భవన నిర్మాణం మొత్తం పూర్తయ్యేది. ఈలోగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు ఆగిపోయాయి. 80వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో జీ ప్లస్‌ ఫోర్‌లో నిర్మాణమయ్యే ఈ భవనం పూర్తయితే సెల్లార్‌లో పెద్ద సంఖ్యలో కార్లు, బైక్‌లు పార్కింగ్‌ చేసుకునే అవకాశం ఉంది. గ్రౌండ్‌ ఫ్లోర్‌లో టీబీసీడీ వార్డు, గేరియాట్రిక్‌ (వృద్ధులకు)వార్డు, మొదటి అంతస్తులో ఈఎన్‌టీ విభాగం, ఫిమేల్‌ ఆర్థోపెడిక్‌ విభాగం, మేల్‌ ఆర్థోపెడిక్‌ విభాగం, రెండవ అంతస్తులో సైకియాట్రిక్‌ వార్డు, జనరల్‌ సర్జరీ విభాగం, మూడో ఫ్లోర్‌లో డీవీఎల్‌ విభాగం, జనరల్‌ మెడిసిన్‌ విభాగం, 4వ అంతస్తులో పోస్టు ఆపరేటివ్‌ వార్డు, రికవరీ వార్డు, ఐసీయూ, ఐసీసీయూ, ఎంఐసీయూతో పాటు 14 ఆపరేషన్‌ థియేటర్లు ఇందులో అందుబాటులోకి వస్తాయి. అలాగే కొద్దిపాటి నిధులు విడుదల చేస్తే మెడికల్‌ కాలేజీలోని లెక్చరర్‌ గ్యాలరీ, ఎగ్జామినేషన్‌ హాలు, డ్రగ్‌ కంట్రోల్‌ డిపార్ట్‌మెంట్‌ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

వైఎస్సార్‌సీపీ హయాంలో

అప్పటి ప్రభుత్వం నాడు–నేడు పథకం కింద నిధులు కేటాయించి అన్ని బోధనాసుపత్రులను అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టింది. కర్నూలు మెడికల్‌ కాలేజీ, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలల అభివృద్ధికి రూ.500 కోట్లకు అప్పట్లో అడ్మినిస్ట్రేషన్‌ శాంక్షన్‌ ఇచ్చింది. ఇందులో రూ.350 కోట్లు భవనాలకు, రూ.150 కోట్లు పరికరాలకు కేటాయించారు. భవనాల్లో భాగంగా ఆసుపత్రిలో ఇన్‌ పేషంట్‌ డిపార్ట్‌మెంట్‌ భవనం, అవుట్‌ పేషెంట్‌ డిపార్ట్‌మెంట్‌, అధునాతన క్యాజువాలిటీ, మోడరన్‌ మార్చురీ, బయోమెడికల్‌ వేస్ట్‌ షెడ్డు, మెడికల్‌ కాలేజీలో అడ్మినిస్ట్రేటివ్‌ బిల్డింగ్‌, లెక్చరర్‌ గ్యాలరీల నిర్మాణాలు చేపట్టేలా ప్రణాళిక రూపొందించారు. ముందుగా ఆసుపత్రిలో ఐపీడీ, కళాశాలలో ఎగ్జామినేషన్‌ హాల్‌, లెక్చరర్‌ గ్యాలరీల నిర్మాణాలు కొనసాగాయి.

నిమ్స్‌ తరహాలో తీర్చిదిద్దితే..

హైదరాబాద్‌లోని నిమ్స్‌ తరహా ఆసుపత్రిగా కర్నూలు జీజీహెచ్‌ను తీర్చిదిద్దుతామని పదేళ్ల క్రితం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. అప్పట్లో ఐదేళ్లు ఆ పార్టీ నాయకులు ఈ మాట చెబుతూనే వచ్చినా ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. నిమ్స్‌ తరహాలో ఈ ఆసుపత్రిని అభివృద్ధి చేస్తే రాయలసీమకు తలమానికంగా మారుతుంది. అత్యాధునిక వైద్యసేవలు, స్పెషాలిటీ, సూపర్‌స్పెషాలిటీ బ్లాక్‌లలో అత్యాధునిక వైద్యపరికరాలతో రోగులకు కార్పొరేట్‌ స్థాయి వైద్యసేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. రాష్ట్ర విభజన తర్వాత కర్నూలులో ఏర్పాటవుతుందనుకున్న రిమ్స్‌ హాస్పిటల్‌ను అమరావతికి తరలించుకుపోవడంతో ఇక్కడి ప్రజల ఆశలు నీరుగారిపోయాయి. ప్రస్తుతం ప్రధానమంత్రి నరేంద్రమోదీ మొదటి రాజధాని కర్నూలుకు వస్తున్నందున ఆయనైనా ఆసుపత్రి రూపురేఖలు మార్చేందుకు ఏదైనా ప్రకటన చేస్తారని ఇక్కడి ప్రజలు ఎదురుచూస్తున్నారు.

క్లుప్తంగా

బనవాసి ఏఓ ఆన్‌డ్యూటీపై బదిలీ

కర్నూలు(అగ్రికల్చర్‌): వ్యవసాయ శాఖ బనవాసి ఫామ్‌లో వ్యవసాయ అధికారిగా పని చేస్తున్న శారదమ్మ ఆన్‌ డ్యూటీపై కర్నూలు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయానికి బదిలీ అయ్యారు. హాలహర్వి ఏఓగా పనిచేస్తున్న వేదానందం బనవాసి ఫామ్‌కు బదిలీ అయిన నేపథ్యంలో ఆ స్థానంలో ఉన్న శారదమ్మ డిప్యుటేషన్‌పై కర్నూలు డీఏఓ కార్యాలయం సాంకేతిక ఏఓగా బదిలీ అయ్యారు. ఈమె ఈ ఏడాది జూన్‌ వరకు ఇక్కడ పనిచేసి బనవాసి ఫామ్‌కు బదిలీ అయ్యారు. తాజాగా డిప్యుటేషన్‌పై మళ్లీ ఇక్కడకు బదిలీ కావడం విశేషం. కాగా మంత్రాలయం అగ్రీ ల్యాబ్‌ ఏఓ అనిల్‌కుమార్‌ కూడా ఆన్‌ డ్యూటీపై డీఏఓ కార్యాలయానికి బదిలీ కానున్నట్లు తెలుస్తోంది. ఒకటి, రెండు రోజుల్లో ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశం ఉంది.

కొత్తిమీర పంటపై గడ్డి మందు పిచికారీ


ఎండిన కొత్తిమీర పంటను చూపుతున్న రైతు

ఎమ్మిగనూరురూరల్‌: మండల పరిధిలోని రాళ్లదొడ్డి గ్రామానికి చెందిన రైతు సలాం సాగు చేసిన ఎకరా కొత్తిమీర పంటకు గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి మందు పిచికారీ చేశారు. రూ.60 వేలు పెట్టుబడి పెట్టి సాగుచేశానని, చేతికొచ్చే సమయంలో ఓర్వలేని వారు గడ్డి మందు పిచికారీ చేయటంతో పంట పూర్తిగా ఎండిపోయిందని రైతు వాపోయాడు. దాదాపు రూ.2 లక్షల వరకు తనకు నష్టం వచ్చిందని, దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతు కోరాడు.

బస్సు కింద పడి విద్యార్థికి గాయాలు


గాయపడిన విద్యార్థి

ఎమ్మిగనూరు రూరల్‌: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌ ఆవరణలో మంగళవారం సాయంత్రం బడి బస్సు కింద పడి ఓ విద్యార్థి గాయపడ్డాడు. వివరాలు.. మండల పరిధిలోని వెంకటగిరి గ్రామానికి చెందిన తిమ్మప్ప, అనితల కుమారుడు శివశంకర్‌(13) పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. రోజూ గ్రామం నుంచి బడి బస్సులో రాకపోకలు సాగిస్తున్నా డు. సాయంత్రం వెంకటగిరికి వెళ్లే బడి బస్సు రావటంతో పరిగెత్తుకుంటూ విద్యార్థులు వెళ్తుండగా శివశంకర్‌ అదుపుతప్పి బస్సు వెనుక చక్రం కింద పడ్డాడు. కుడి తొడపై చక్రం ఎక్కటంతో తీవ్ర గాయమైంది. పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మాజీ సైనికుల పిల్లలకు ఉపకార వేతనాలు

కర్నూలు(అర్బన్‌): 2025–26 విద్యా సంవత్సరంలో ప్రొఫెషనల్‌ డిగ్రీ కోర్సులు మొదటి సంవత్సరం చదువుతున్న మాజీ సైనికుల పిల్లలకు ప్రధానమంత్రి ఉపకార వేతనాలను అందించనున్నట్లు జిల్లా సైనిక సంక్షేమ అధికారిణి ఎస్‌ఆర్‌ రత్నరూత్‌ తెలిపారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని మంగళవారం ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిర్ణీత దరఖాస్తును వెబ్‌సైట్‌ అడ్రస్‌ కేఎస్‌బీ.జీఓవీ.ఇన్‌ ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే డిసెంబర్‌ 31లోగా అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

శిశు గృహకు ఆపేక్ష


ఆపేక్ష

కర్నూలు(అర్బన్‌): స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్య శాలలో గత నెల 26న గుర్తించిన ఆపేక్షను మంగళవారం సి.క్యాంప్‌ సెంటర్‌లోని శిశు గృహకు చేర్చినట్లు ఐసీడీఎస్‌ పీడీ పి.విజయ తెలిపారు. ఆడ శిశువును తల్లిదండ్రులు హాస్పిటల్‌లోనే వదిలి వెళ్లారని, స్వల్ప అనారోగ్యంతో ఉన్న శిశువుకు వైద్యం అందించి, బాలల సంక్షేమ సమితి ఉత్తర్వుల మేరకు తమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక దత్తత సంస్థ (శిశు గృహ)కు చేర్చి సంరక్షిస్తున్నట్లు తెలిపారు. శిశువును తమ చిన్నారిగా రుజువు చేసేందుకు తగిన సాక్ష్యాధారాలతో జన్మనిచ్చిన తల్లిదండ్రులు, సంబంధీకులు 30 రోజుల్లోపు సంప్రదించాలన్నారు. లేని పక్షంలో 'వదిలేసిన శిశువు'గా ప్రకటించి కారా, న్యూఢిల్లీ దత్తత నిబంధనల మేరకు దత్తత ఇస్తామన్నారు.

నవంబర్‌ 2న కురువల కార్తీక వనభోజనాలు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కురువ సంఘం నేతలు

కర్నూలు(అర్బన్‌): జిల్లా కురువ సంఘం ఆధ్వర్యంలో నవంబర్‌ 2న స్థానిక పెద్దపాడు రోడ్డు ఏపీ మోడల్‌ స్కూల్‌ సమీపంలో ఉన్న భీర లింగేశ్వర స్వామి ఆలయం వద్ద కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పత్తికొండ శ్రీనివాసులు, ఎంకే రంగస్వామి తెలిపారు. కార్యక్రమ కరపత్రాలను మంగళవారం పంచలింగాల గ్రామంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్తీక వన భోజన కార్యక్రమానికి మంలో జిల్లాలోని కురువలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ గుడిసె శివన్న, మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీలీలమ్మ, ప్రధాన కార్యదర్శి అనిత,నాయకులు ధనుంజయ, బీ వెంకటేశ్వర్లు, పాల సుంకన్న, కేసీ నాగన్న, శ్రీనివాసులు, బి తరుణ్‌, చిరంజీవి, మద్దిలేటి, బాలరాజు పాల్గొన్నారు.

కూలీల వాహనాలు బోల్తా


బోల్తా పడిన బొలేరో వాహనం


క్షతగాత్రులను పరామర్శిస్తున్న భువనేశ్వరరెడ్డి

- 20 మందికి గాయాలు

గడివేముల: మండల పరిధిలోని పెసరవాయి రస్తాలో అదుపుతప్పి ఓ బొలేరో వాహనం, ఆటో బోల్తా పడిన ఘటనలో దాదాపు 20 మంది కూలీలు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు.. బండిఆత్మకూరు మండలం పెద్దదేవుళాపురం, భోజనం, మోత్కూరు గ్రామాల నుంచి ప్రతిరోజు దాదాపు 40 నుంచి 50 ఆటోల్లో గడివేముల మండలంలోని వివిధ గ్రామాలకు వ్యవసాయ పనులకు వస్తుంటారు. మంగళవారం ఉదయం ఆయా గ్రామాల నుంచి బొలేరో వాహనం, ఆటో కూలను ఎక్కించుకుని గని గ్రామ పరిధిలోని పొలాలకు బయలుదేరాయి. పెసరవాయి రస్తాలోని ఘటనా స్థలం వద్ద బొలేరో వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న కాల్వలోకి పూర్తిగా ఒరిగిపోయింది. వెనక నుంచి వస్తున్న ఆటో కూడా వేగం అదుపుకాక బోల్తా పడింది. ప్రమాదంలో పెద్దదేవుళాపురం గ్రామానికి చెందిన రాములక్క, కళావతి, మాధవి, పద్మావతి, బాల లక్ష్మమ్మ, రామేశ్వరి, దస్తగిరి, భోజనం గ్రామానికి చెందిన దూదేకుల బజారమ్మ, నాగలక్ష్మమ్మ, సుభద్రమ్మతోపాటు మరో పదిమంది కూలీలకు గాయాలయ్యాయి. చుట్టుపక్కల పొలాల రైతులు స్పందించి వెంటనే 108 అంబులెన్స్‌ ద్వారా నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రతి రోజు పరిమితికి మించి వాహనాలు కూలీలకు ఎక్కించుకుని రాకపోకలు సాగిస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వరరెడ్డి ఆస్పత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

పట్నమెళ్లిపోతున్న పల్లెలు!


చిన్నారులతో సహా వలస వెళ్తున్న రాళ్లదొడ్డి గ్రామస్తులు

రెక్కల కష్టం వర్షార్పణమైంది. ఆదుకోవాల్సిన ప్రభుత్వం చేతులెత్తేసింది. కనీసం చేసేందుకు కూడా ఉన్న ఊళ్లో పని లేదు.. ఊరకే ఉంటే తినడానికి తిండి దొరకదు. అందుకే కడుపు చేతపట్టుకుని వలస బాట పడుతున్నారు పశ్చిమ ప్రాంతవాసులు. నందవరం మండలం పూలచింత గ్రామానికి చెందిన దాదాపు 20 కుటుంబాలు మంగళవారం పిల్లాపాపలతో కలిసి మూటాముల్లె సర్దుకుని తెలంగాణ రాష్ట్రానికి వెళ్లగా.. ఎమ్మిగనూరు మండలం రాళ్లదొడ్డి గ్రామానికి చెందిన మరో పది కుటుంబాలు కర్ణాటక రాష్ట్రానికి పత్తి తీసే పనులు కోసమంటూ బయలుదేరారు. కొన్ని రోజుల నుంచి పల్లెలు వలస బాట పడుతున్నా అధికారులు మాత్రం గుడ్లప్పగించి చూస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. – నందవరం

యువకుడి ఆత్మహత్య


మృతుడు గంపల సోమ

ఆదోని సెంట్రల్‌: మండల పరిధిలోని మదిరె గ్రామానికి చెందిన గంపల ఈరప్ప కుమారుడు కొరియా గంపల సోమ(31) మంగళవారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్‌ఐ గోపాల్‌ తెలిపిన వివరాలు.. సోమ ఎనిమిదేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. కూతురు ఉంది. మగ సంతానం లేదని మనోవేదనతో మధ్యాహ్నం ఇస్వీ రైల్వే స్టేషన్‌ సమీపంలోని 501/18–20 కిలో మీటరు నంబర్‌ వద్ద గూడ్స్‌ కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల అడ్డగింత


ఇసుక ట్రాక్టర్‌ను అడ్డుకున్న పాఠశాల చైర్మన్‌ గురురాజు

మంత్రాలయం: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను మంత్రాలయంలో పాఠశాల చైర్మన్‌, విద్యార్థులు కలిసి అడ్డుకున్నారు. కొంతకాలంగా ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. తుంగభద్ర నది నుంచి దాదాపు 30 ట్రాక్టర్లలో ఇసుకను మండల కేంద్రంలోని సంత మార్కెట్‌లో ఉన్న ఎంపీయూపీ పాఠశాల ఆవరణంలో నుంచి అక్రమంగా తరలిస్తుడడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను గుర్తించిన పాఠశాల చైర్మన్‌ సున్నం గురురాజు మంగళవారం ట్రాక్టర్లను నిలిపివేశాడు. ఇటు ట్రాక్టర్లను తిప్పవద్దని ఎన్ని సార్లు చెప్పినా వినకపోడంతో రోడ్డుకు అడ్డంగా ఎద్దుల బండ్లను నిలిపి ట్రాక్టర్లను నిలిపి వేశామని, ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి ఇసుక ట్రాక్టర్లను ఇటు వైపు రాకుండా చూడాలని కోరారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు యువకుల మృతి


మృతి చెందిన శ్రీకాంత్‌ రెడ్డి

బేతంచెర్ల/వెల్దుర్తి: వేర్వేరు ప్రమాదాల్లో మంగళవారం ఇద్దరు యువకులు మృతి చెందారు. బలపాలపల్లె గ్రామ సమీపంలోని జిందాల్‌ కంపెనీలో టిప్పర్‌ ఢీకొని బేతంచెర్ల బైటిపేట కాలనీకి చెందిన శ్రీకాంత్‌(30), బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో రామళ్లకోటకు చెందిన ఉప్పరి రవితేజ(25) మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాలు.. శ్రీకాంత్‌రెడ్డి ఆరేళ్లుగా జిందాల్‌ కంపెనీలోని ఎంఎస్‌ఆర్‌ మైన్స్‌లో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. ఉదయం టిప్పర్‌ మరమ్మతులకు గురి కావడంతో బాగు చేయించడానికి బేతంచెర్లకు బయలుదేరారు. మార్గమధ్యలో మెట్ట వద్ద టిప్పర్‌ నుంచి శబ్దం రావడంతో నిలిపి డోర్‌ వెనుక పరిశీలిస్తుండగా టిప్పర్‌ ఒక్కసారిగా వెనక్కి రివర్స్‌ అయి శ్రీకాంత్‌ ఛాతీని ఢీకొంది. విషయం తెలుసుకున్న కంపెనీ అధికారులు హుటాహుటిన శ్రీకాంత్‌రెడ్డిని కర్నూలు ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..


మృతుడు ఉప్పరి రవితేజ

వెల్దుర్తి మండలం రామళ్లకోట గ్రామానికి చెందిన ఉప్పరి రవితేజ సోమవారం రాత్రి స్నేహితులను బైక్‌పై హైవే–44పై అమకతాడు టోల్‌ప్లాజా వద్ద డ్రాప్‌ చేశాడు. తిరుగుప్రయాణంలో లద్దగిరి రహదారిలో గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొనడంతో రవితేజ మృతిచెందాడు. మంగళవారం ఉదయం పొలం పనులకు వెళ్లిన రైతులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెల్దుర్తి సీహెచ్‌సీకి తరలించారు. మృతుడి తండ్రి సుబ్బరాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అశోక్‌ తెలిపారు.

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి


రైతులకు శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న డీఏఓ మద్దిలేటి

కోవెలకుంట్ల: ప్రభుత్వం సరఫరా చేస్తున్న సబ్సిడీ శనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మద్దిలేటి సూచించారు. స్థానిక మార్కెట్‌యార్డు ఆవరణలో మంగళవారం రైతులకు సబ్సిడీ శనగ విత్తనాల పంపిణీ ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 29 మండలాల పరిధిలో ఈ ఏడాది రబీ సీజన్‌లో 57,299 హెక్టార్లలో పప్పుశనగ సాగు చేయాల్సి ఉండగా 11,950 క్వింటాళ్ల విత్తనాలు మంజూరయ్యాయన్నారు. కోవెలకుంట్ల వ్యవసాయ సబ్‌ డివిజన్‌లోని ఆరు మండలాలకు 7,900 క్వింటాళ్ల విత్తనాలు కేటాయించామన్నారు. ప్రభుత్వం క్వింటాకు రూ.7,800 ధర నిర్ణయించగా 25 శాతం సబ్సిడీ పోనూ రైతులకు రూ. 5,850కు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏడీఏ సుధాకర్‌, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్‌ మధులత, వైస్‌ చైర్మన్‌ శేఖర్‌రెడ్డి, సెక్రటరీ నారాయణస్వామి, వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్‌ గువ్వల సుబ్బారెడ్డి, మండల వ్యవసాయాధికారులు సుధాకర్‌రెడ్డి, నాగేంద్ర ప్రసాద్‌, జ్యోతి, ఏఈఓలు రమణ, దివ్య పాల్గొన్నారు.

ప్రభుత్వంపై ఉద్యోగుల్లో అసంతృప్తి

- దసరా కానుకగా డీఏలు ఇవ్వకపోవడంపై తీవ్ర నిరాశ

కర్నూలు(అగ్రికల్చర్‌): ప్రభుత్వంపై ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. దసరా కానుకగా ఒక్క డీఏ కూడా ఇవ్వకపోవడంతో ఉద్యోగ ఉపాధ్యాయ, కార్మికులు, పెన్షనర్లను తీవ్ర నిరాశకు గురయ్యారు. దసరా తర్వాత ఈనెల 10న మంత్రి మండలి సమావేశంలోనైనా డీఏలు, ఐఆర్‌పై నిర్ణయం తీసుకుంటుందని ఆశించిన ఉద్యోగులు.. ఆ ఊసే లేకపోవడంతో ప్రభుత్వంపై మండిపడుతున్నారు. ఈనెల 20న దీపావళి పండుగకైనా డీఏ, ఐఆర్‌ ప్రకటించే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై ఉద్యోగ సంఘాలు ఒత్తిడి తెస్తారని ఉద్యోగులు భావిస్తున్నా అది కూడా నెరవేరే లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిన్నర అవుతున్నా ఒక్క డీఏ కూడా ఇవ్వలేదు. 12వ వేతన సవరణ కమిషన్‌ వేయలేదు. పీఆర్‌సీ జాప్యమయితే మధ్యంతర భృతి ఇవ్వాల్సి ఉంది. నెలకు రెండు, మూడు సార్లు మంత్రిమండలి సమావేశాలు జరుగుతున్నాయి. ఒక్క సమావేశంలో కూడా ఉద్యోగుల డిమాండ్లను ప్రస్తావించకపోవడంతో తీవ్ర నిరుత్సాహానికి గురవుతున్నారు. ప్రభుత్వంపై ఉద్యోగులు మొత్తం ఆగ్రహంతో రగిలిపోతున్నా ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్‌, ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నోరువిప్పడంలేదు. సచివాలయ ఉద్యోగులు, పీహెచ్‌సీ డాక్టర్లు, సచివాలయ ఉద్యోగులు, విద్యుత్‌ ఉద్యోగులు ఇప్పటికే రోడ్డెక్కారు. ఈనెల 15 నుంచి విద్యుత్‌ శాఖలో 23 సంఘాలు ఏకమై నిరవధిక సమ్మెకు సిద్ధమయ్యాయి. రానున్న రోజుల్లో మరిన్ని ఉద్యోగ సంఘాలు రోడ్డెక్కనున్నాయి. గతంలో ఎపుడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఏడాది నుంచే అన్ని వర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

భారీ వాహన రాకపోకలపై నిషేధం

- 16వ తేదీ ఉదయం నుంచి రాత్రి వరకు ఎక్కడికక్కడే నిలుపుదల
- పలు చోట్ల దారి మళ్లింపు



కర్నూలు: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 16వ తేదీన కర్నూలు పర్యటన నేపథ్యంలో కర్నూలు మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్లే భారీ వాహనాల రాకపోకలపై నిషేధం విధించినట్లు ఎస్పీ విక్రాంత్‌ పాటిల్‌ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి రాత్రి 9 గంటల వరకు లారీలతో పాటు భారీ వాహనాలు ఎక్కడికక్కడే నిలుపుకోవాలని సూచించారు.

- కడప నుంచి కర్నూలు మీదుగా హైదరాబాద్‌కు వెళ్లే బస్సులు పాణ్యం, గడివేముల, మిడుతూరు, బ్రాహ్మణకొట్కూరు, కోళ్ల బాపురం, పూడూరు మీదుగా అలంపూరు చౌరస్తా చేరుకుని హైదరాబాద్‌కు వెళ్లేలా ట్రాఫిక్‌ మళ్లింపు.
- కడప నుంచి కర్నూలుకు వచ్చే వాహనాలు కూడా పాణ్యం, మిడుతూరు, నందికొట్కూరు, కోళ్ల బాపురం, పూడూరు, అలంపూర్‌ చౌరస్తా నుంచి కర్నూలుకు చేరుకోవాలి.
- నంద్యాల నుంచి బెంగళూరు వైపు వెళ్లే వాహనాలు పాణ్యం, బనగానపల్లె, ఎస్‌.రాచర్ల, డోన్‌ మీదుగా బెంగళూరుకు వెళ్లాల్సి ఉంటుంది. సోమయాజులపల్లె, బేతంచెర్ల, డోన్‌ మీదుగా బెంగుళూరుకు చేరుకోవచ్చు.
- శ్రీశైలం, ఆత్మకూరు నుంచి కర్నూలు మీదుగా అనంతపురం వెళ్లే వాహనాలను ఆత్మకూరు, బండి ఆత్మకూరు, పాణ్యం, బనగానపల్లె, ఎస్‌.రాచర్ల, డోన్‌ మీదుగా అనంతపురం వెళ్తాయి.
- ఆత్మకూరు వైపు నుంచి బళ్లారి వైపు వెళ్లే వాహనాలు నందికొట్కూరు, కోళ్ల బాపురం, పూడూరు, అలంపూరు చౌరస్తా, శాంతి నగర్‌, మీదుగా బళ్లారికి చేరుకోవాల్సి ఉంటుంది.
- అనంతపురం నుంచి హైదరాబాద్‌ వెళ్లే వాహనాలు గుత్తి, జొన్నగిరి, తుగ్గలి, పత్తికొండ, ఆస్పరి, ఆదోని, మంత్రాలయం, మాధవరం, రాయచూరు మీదుగా హైదరాబాద్‌కు వెళ్లాల్సి ఉంటుంది.
- అనంతపురం నుంచి కర్నూలు మీదుగా నంద్యాల వెళ్లే వాహనాలు ప్యాపిలి, ఎస్‌.రాచర్ల, బనగానపల్లె, పాణ్యం మీదుగా నంద్యాలకు మళ్లిస్తారు.
- బళ్లారి నుంచి హైదరాబాద్‌ వెళ్లే వాహనాలు ధనాపురం క్రాస్‌, ఆదోని, మాధవరం, రాయచూరు మీదుగా హైదరాబాదుకు చేరుకోవాలి.
- ఆదోని సిరిగుప్ప చెక్‌పోస్టు, ఆదోని, ఎమ్మిగనూరు ప్రాంతాల నుంచి కర్నూలుకు వచ్చే బస్సులు కర్నూలు శివారులోని ఉల్చాల వై–జంక్షన్‌, ఎల్కూరు బంగ్లా, విష్ణు టౌన్‌ షిప్‌, సంతోష్‌ నగర్‌ మీదుగా హైదరాబాద్‌కు వెళ్లేలా మళ్లిస్తున్నారు.
- నంద్యాల నుంచి కర్నూలుకు వచ్చే వాహనాలు తమ్మరాజుపల్లె, బేతంచెర్ల, డోన్‌ మీదుగా, కాల్వబుగ్గ, ఎంబాయి, రామళ్లకోట, వెల్దుర్తి మీదుగా కర్నూలుకు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు.
- ఓర్వకల్లు వైపు నుంచి హైదరాబాద్‌ వెళ్లే వాహనాలు కన్నమడకల, చౌట్కూరు, కడుమూరు, మిడుతూరు, నందికొట్కూరు మీదుగా హైదరాబాద్‌కు చేరుకోవాల్సి ఉంది.
- పూడిచెర్ల, కేతవరం, గార్గేయపురం, బ్రాహ్మణకొట్కూరు రోడ్డు గుండా కూడా హైదరాబాద్‌కు వెళ్లేలా మరో రూటు ఏర్పాటు చేశారు.
- అలాగే ఎల్లమ్మ గుడి, పడిదెంపాడు, పూడూరు, రేలంపాడు, అలంపూరు మీదుగా హైదరాబాద్‌కు వెళ్లేలా మరో మార్గాన్ని ఏర్పాటు చేశారు.

సైబర్‌ నేరగాళ్ల వలలో ఫైర్‌ అధికారి

డోన్‌ టౌన్‌: సైబర్‌ నేరగాళ్ల వలకు డోన్‌ ఫైర్‌ ఆఫీసర్‌ రంగస్వామిగౌడ్‌ చిక్కి రూ.83 వేలు చేజార్చుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నాలుగు రోజుల క్రితం నంద్యాల ఫైర్‌ స్టేషన్‌కు గుర్తు తెలియని ఆగంతుకుడు ఫోన్‌ చేసి రంగస్వామిగౌడా అని ప్రశ్నించగా కాదు సార్‌ ఆయనది డోన్‌ అని చెప్పగా తాము విజయవాడ నుంచి మాట్లాడుతున్నాము కాన్ఫరెన్స్‌ కాల్‌ పెట్టమని చెప్పగా ఎలాంటి వివరాలు తెలుసుకోకుండా డోన్‌ అధికారికి నంద్యాల సిబ్బంది లైన్‌ కలిపారు. అనంతరం నేరగాళ్లు నంద్యాల లైన్‌ కట్‌ చేసి, డోన్‌ అధికారితో మాటలు కలిపారు. 'మీరు మీ వృత్తిలో పలు చోట్ల అక్రమాలకు పాల్పడ్డారు. త్వరలో రిటైర్మెంట్‌ ఉంది. మా సార్‌ రిపోర్టు రాస్తే మీకు అందాల్సిన బెనిఫిట్స్‌ నిలిచిపోతాయి. రిపోర్ట్‌ రాయకుండా నేను చూస్తాను. వెంటనే రూ.2 లక్షలు పంపు' అని అనగానే తన వద్ద అంత లేదనడంతో ప్రస్తుతానికి రూ.లక్ష పంపమని కోరారు. దీంతో రూ.83 వేలు ఫోన్‌పే చేశారు. ఇంటికి వెళ్లి విచారంగా ఉండటంతో కుటుంబ సభ్యులు ఆరా తీసి, సైబర్‌ నేరగాళ్ల పనేనని నిర్ధారించుకుని 1903కు, డోన్‌ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



పఠనాభిరుచి కేవలం ఆహ్లాదానికి సంబంధించిన విషయం మాత్రమే కాదని, అభిజ్ఞా వ్యాయామం (కాగ్నిటివ్ ఎక్సర్‌సైజ్) అని శాస్త్రీయ అధ్యయనాలు తెలియ జేస్తున్నాయి. ' పుస్తక పఠనం అనేది మెదడులో ఇన్‌ఫర్మేషన్ ప్రాసెసింగ్‌కు సంబంధించి కొత్త మార్గాలను సృష్టిస్తుంది' అంటున్నారు దెవలప్‌మెంటల్ సైకాలజీ అండ్ కాగ్నిటివ్ న్యూరోసైన్స్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ గ్రెగోయిర్.



ప్రతీకాత్మక చిత్రం

వద్దిక... ఓవర్ ఒద్దిక బెటర్!

పేరెంటింగ్‌పై చర్చ

ఇది వైరల్ కాలం! సర్వైలెన్స్ కెమెరాల మధ్య బిగ్ బాస్ హౌస్ ఉన్నట్టే జెన్ ఆల్ఫా కూడా తమను సోషల్ మీడియా ఫ్రేమ్‌లో ఫిక్స్ చేసుకుంది! అందుకే వాళ్లు ఎక్కువగా ఇన్‌ఫ్లుయెన్సర్స్‌ను, వాళ్లు చూస్తున్న రీల్స్, షార్ట్స్, షోస్‌లోని క్యారెక్టర్స్‌ను అనుకరిస్తుంటారు. ఈ తీరు కొందరికి అతిగా... అసహజంగా అమర్యాదగా తోచవచ్చు. ఇంకొందరికి ముచ్చటగా అనిపించవచ్చు. ఈ రెండిటికీ ఉదాహరణగా ఇటీవల వైరల్ అయిన కౌన్ బనేగా కరోడ్‌పతి 17 వ సీజన్ 'కేబీసీ జూనియర్స్' లో ఓ చిన్నారి పార్టిసిపెంట్ వీడియోను చూపిస్తున్నారు. దీనిపై కామెంట్లు, కాంప్లిమెంట్లను పక్కన పెడితే ఈ వీడియో.. జెన్ ఆల్ఫా పేరెంటింగ్ కి సంబంధించి ఓ చర్చను లేవనెత్తింది...

కేబీసీలో ఇదీ జరిగింది..

కౌన్ బనేగా కరోడ్‌పతి17వ సీజన్‌లోని 'కేబీసీ జూనియర్స్' హాట్ సీట్‌లో ఓ బుడతడు కూచున్నాడు. చుట్టూ కెమెరాలు.. ఆడియెన్స్.. ఎదురుగా 83 ఏళ్ల పాపులర్ పర్సనాలిటీ.. ఎవర్‌గ్రీన్ సెలబ్రిటీ అమితాబ్ బచ్చన్.. అయినా ఎలాంటి బెరుకు లేకుండా చాలా రిలాక్స్‌డ్‌గా.. ఇంకా చెప్పాలంటే ఆ కూర్చోవడంలోనే అందరి అటెన్షన్‌ను గ్రాబ్ చేశాడా పిల్లాడు. వాడి ఆత్మవిశ్వాసానికి ముచ్చటపడుతూ అమితాబ్ 'హాట్ సీట్‌లో కూర్చోవడం ఎలా ఉంది?' అనడిగారు. 'ఎక్సయిటెడ్‌గా ఉన్నాను కానీ.. మీరు రూల్స్ చెబుతూ కూర్చోకండి.. నాకు ఈ షో రూల్స్ అన్నీ తెలుసు.. నేరుగా పాయింట్‌కి వచ్చేద్దాం' అన్నాడు. ఆ జవాబు హోస్ట్ అయిన అమితాబ్‌ను ఖంగుతినేలా చేసింది. అయినా తమాయించుకుని షోని ప్రొసీడ్ చేశాడు. మొదటి ప్రశ్న అడిగి ఆప్షన్స్ ఇచ్చేలోపే జవాబు చెప్పి ఆప్షన్స్ లేకుండానే నా ఆన్సర్‌ని లాక్ చేసేయ్ డాన్స్.. ఆప్షన్ ఏదైనా ఈ ఆన్సర్ లాక్ చేసెయ్' అన్నాడు అమర్యాదగా. ఆ తర్వాత ప్రశ్న అడిగేముందు ఏదో చెప్పబోతున్న అమితాబ్‌ను'మీరు ప్రశ్న యితే అడగండి ముందు' అన్నాడు అదే ధోరణిని కొనసాగిస్తూ. అదే ప్రవర్తనతో ఆ పిల్లాడు అలా అయిదవ ప్రశ్న దాకా వచ్చాడు. 25 వేలు వచ్చే అయిదవ ప్రశ్న 'వాల్మీకి రామాయణంలోని మొదటి కాండ ఏది?' కి ఆప్షన్స్ అడిగాడు ఆ కుర్రాడు.'బాల కాండ.. అయోధ్య కాండ.. కిష్కింధ కాండ.. యుద్ధ కాండ' అంటూ నాలుగు ఆప్షన్స్‌ను చదివారు అమితాబ్. వెంటనే 'బి.. అయోధ్యకాండ' అని చెబుతూ 'ఒక్కసారి కాదు ఈ ఆన్సర్‌ను నాలుగుసార్లు లాక్ చేయండి' అన్నాడు పిల్లాడు. 'సారీ.. తప్పు చెప్పావ్.. కరెక్ట్ ఆన్సర్ బాలకాండ' అన్నారు అమితాబ్. ఈసారి ఆ పిల్లాడు ఖంగు తిన్నాడు.

ఆ బాబు వయసు పదేళ్లు. అయిదవ తరగతి చదువుతున్నాడు. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఉంటాడు. ఆ పిల్లాడు జవాబులు చెబుతుంటే ఆడియెన్స్ గ్యాలరీలో ఉన్న అతని తల్లిదండ్రులు కొడుకువైపు మురిపెంగా.. గర్వంగా చూడసాగారు.

ఈ కార్యక్రమాన్ని వీక్షించిన వాళ్లు సోషల్ మీడియాలో రెండురకాలుగా స్పందించారు. కొందరు 'జ్ఞానం ఒక్కటే ఉంటే సరిపోదు.. కాసింత వినయం, సంస్కారం కూడా ఉండాలి','అది కాన్ఫిడెన్స్ కాదు ఓవర్ కాన్ఫిడెన్స్.. ', 'చదువు కన్నా ముందు పిల్లలకు మర్యాద, మన్నన నేర్పాలి', 'అమ్మో... పిల్లాడు కాదు... మహా ముదురు' అంటూ, ఇంకొందరు 'అయిదు నిమిషాల ఫుటేజ్ చూసి పిల్లాడి బిహేవియర్‌ని జడ్జ్ చేయడమేంటి?', 'పేరెంట్స్ పిల్లాడికి కాస్త మర్యాదగా నడుచుకోమని చెప్పి ఉంటే బాగుండేది' అంటూ కామెంట్ చేశారు.

బ్రేక్ పడాల్సిన ప్లేస్ ఇల్లు...

'ఇలాంటి ప్రవర్తన ఉన్న ట్రెండ్‌ను 6 -13 ఏళ్ల పిల్లల్లో ఎక్కువగా చూస్తాం. ఇది బుద్ధిమాంద్యం లేదా ఏడీహెచ్‌డీ ఏమాత్రం కాదు. డిఫరెంట్‌గా కనిపించాలనే తాపత్రయం, పదిమంది దృష్టిని ఆకర్షించాలన్న లక్ష్యం. ఒక్క మాటలో చెప్పాలంటే డిఫరెంట్ బిహేవియర్‌తో సోషల్ మీడియా అటెన్షన్‌ను గ్రాబ్ చేయడమన్న మాట. దీనికి ఇండివిడ్యువలిస్ట్‌గా పెరగడం, ఓవర్ కాన్ఫిడెన్స్.. ఓవర్ ఆటిట్యూడ్ బిహేవియర్ కారణం. వాళ్లు సోషల్ ఇన్‌ఫ్లుయెన్సర్, రీల్స్, షార్ట్స్ లోని క్యారెక్టర్లను అనుకరిస్తూ తమ సహజత్వాన్ని మరచిపోతారు. ఆ ప్రభావంతో అందరూ గౌరవిస్తున్న వాళ్ల పట్ల అమర్యాదగా ప్రవర్తిస్తూ అందరి దృష్టిని ఆకర్షించాలనుకుంటారు. అందులో భాగమే పెద్దవాళ్లను ఏకవచనంతో సంబోధించడం, అన్నీ తమకే తెలుసన్నట్లుండటం, వయసుకు మించి మాట్లాడటం లాంటివి. ఇలాంటి పిల్లల ప్రవర్తనను చక్కదిద్దక పోగా దాన్ని వాకి తెలివితేటలుగా అభివర్ణిస్తూ ప్రోత్సహిస్తుంటే ఇదిగో ఇలాగే ఓవర్ కాన్ఫిడెంట్‌గా తయారవుతారు. ఈ తీరును మొక్కగా ఉన్నప్పుడే తుంచేయాలి. దీనికి బ్రేక్ పడాల్సిన ప్లేస్ ఇల్లు.. బ్రేక్ వేసి ఆ ప్రవర్తనను సరిచేయాల్సిన వాళ్లు తల్లిదండ్రులే.



- డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి
కన్సల్టెంట్ చైల్డ్ అండ్ అడల్ట్ సైకియాట్రిస్ట్, హైదరాబాద్

ఆ ట్రైనింగ్ పేరెంట్సే ఇవ్వాలి...

'ఆ బుడతడి వీడియో చాలా వైరల్ అయింది. వైరల్ అయిన వీడియో కూడా జస్ట్ ఒక టూ త్రీ మినిట్స్ క్లిప్పింగ్ అంతే! దాన్నిబట్టే ఆ పిల్లాడి ప్రవర్తనను, పేరెంటింగ్‌ను జడ్జ్ చేయడం కరెక్ట్ కాదని నా ఉద్దేశం. ట్రోల్ చేయడం కూడా తప్పే. అది పిల్లాడి మీద, అతని తల్లిదండ్రుల మీదా తీవ్ర ప్రభావం చూపిస్తుంది. అయితే.. ఆ పిల్లాడిలో ఇంపల్సివిటీ కనిపిస్తోంది. దాన్ని కంట్రోల్ చేసుకోవాలి. ఆ ట్రైనింగ్ పేరెంట్సే ఇవ్వాలి.



- వర్ష వేముల, సైకోథెరపిస్ట్

● భ్రమణ కాంక్ష



రైలుతో... ఆమె చెట్టపట్టాలు

'భారతదేశాన్ని చూడాలంటే రైలులోనే చూడాలి' అంటారు మోనిషా రాజేష్. యు.కె.లో స్థిరపడ్డ ఈ మాజీ జర్నలిస్టు ఇప్పుడు పూర్తిగా 'ట్రావెల్ రైటర్'గా మారారు. ఆశ్చర్యకరంగా ఆమె తన కెరీర్‌కు 'రైలు'ను ఒక ఆధారంగా మలుచుకున్నారు. అంటే పుస్తకాలు అమ్ముడవగా వచ్చే డబ్బు ఆమెకు రైలు ద్వారా వస్తున్నట్టే. 'హఠాత్తుగా నాకు ఏమర్థమైందంటే నా పుస్తకాలకు రైలు కంటే మించిన కథానాయకుడు లేడని' అంటారామె నవ్వుతూ. ఆమె తాజా పుస్తకం 'మూన్‌లైట్ ఎక్స్‌ప్రెస్ – అరౌండ్ ద వరల్డ్ బై నైట్ ట్రైన్' మార్కెట్‌లోకి వచ్చింది. ప్రపంచంలోని అనేక దేశాలలో రాత్రి జర్నీల ద్వారా ట్రైన్‌లలో సంచారం చేస్తూ తాను చూసిన ప్రపంచాన్ని పరిచయం చేశారు మోనిషా. ఇప్పటివరకూ 'రైలు' ప్రయాణాల ఆధారంగా ఆమెవి నాలుగు పుస్తకాలు వచ్చాయి.

మొదటిసారి రైలుతో ప్రేమ

మోనిషా తల్లిదండ్రులది చెన్నై. ఇద్దరూ డాక్టర్లు. అయితే యు.కెలోని నార్‌ఫోక్‌లో స్థిరపడ్డారు. మోనిషా అక్కడే పుట్టి పెరిగింది. ఆమెకు 9 ఏళ్లు ఉన్నప్పుడు తల్లిదండ్రులు రెండేళ్ల పాటు వెనక్కు వచ్చి చెన్నైలో ఉన్నారు కాని ఆ సమయంలో మోనిషాకు దేశం గురించి తెలుసుకునే అవకాశం రాలేదు.

తర్వాత ఆమె చదువు సాగి, జర్నలిస్టుగా మారాక, 2010 లో మరోసారి ఇండియాకు వచ్చారు. 'నా దేశాన్ని చూడాలి అని నేను అనుకున్నప్పుడు విమాన ప్రయాణం బడాయి వద్దనుకున్నాను. రోడ్డు సేఫ్ కాదు. అందుకే రైలు ప్రయాణం ఎంచుకున్నాను. 90 రోజుల పాస్ తీసుకుని రైళ్లలో తిరగడం మొదలైన రెండు నెలల్లోనే నాకు అర్థమైపోయింది భారత దేశంలో రైలు ప్రయాణం అద్భుతమని. అందుకే ఈసారి ఒక ప్లాన్‌తో వచ్చి 80 ట్రైన్లలో తిరిగి 'అరౌండ్ ఇండియా ఇన్ 80 ట్రైన్స్' పుస్తకం రాశాను. దానికి బోలెడంత పాఠకాదరణ, అవార్డులు లభించాయి. ఆ ఉత్సాహం నన్ను రైలులో ప్రపంచ యాత్ర చేసేలా చేసింది' అని తెలిపారు మోనిషా. ఆమె ఇండియాలో తిరుగుతూ కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో భువనేశ్వర్ నుంచి హైదరాబాద్‌కు వచ్చారు.. మోనిషా రైలు మార్గం ఉన్న ప్రతి దేశంలో తిరుగుతూ 'అరౌండ్ ద వరల్డ్ ఇన్ 80 ట్రైన్స్' పుస్తకం రాశారు. ఇప్పుడు రాత్రి ప్రయాణాలు ఉన్న రైళ్లలో ప్రయాణించి 'మూన్‌లైట్ ఎక్స్‌ప్రెస్' పుస్తకం రాశారు.



ధన్యమయ్యే ప్రయాణం

'నేను భారతదేశమంతా సెకండ్ క్లాస్ ట్రైన్‌లో తిరిగాను. భారతదేశం అర్థం కావాలంటే ట్రైను ప్రయాణం చేయాలి. అదీగాక మనుషులు విమాన ప్రయాణాలతో విసుగెత్తారు. కోవిడ్ వల్ల లాక్‌డౌన్ వచ్చి ముగిశాక ప్రపంచ వ్యాప్తంగా ప్రజలకు భ్రమణకాంక్ష పెరిగింది. లోకం చూద్దాం అనుకుంటున్నారు. దానికి గొప్ప మార్గం రైలే. యూరప్‌లో 2015 నాటికి రాత్రి ప్రయాణాలు ఉండే స్లీపర్ ట్రైన్‌లు బంద్ చేశారు. ఇప్పుడిప్పుడే అవి తిరిగి మొదలయ్యాయి. స్త్రీలు ఒంటరిగా రాత్రిళ్లు రైలు ప్రయాణాలు చేయడం, జీవితాన్ని ఆస్వాదించడంలో భాగమే' అంటారు మోనిషా.

ప్రకృతి కన్నులు

'టర్కీ నుంచి ఆర్మేనియా వరకూ 26 గంటల పాటు సాగే రైలు ప్రయాణం అద్భుతం. టర్కీ సౌందర్యం మొత్తం అక్కడ చూడొచ్చు. ఇక అత్యుత్తమ రైలు ప్రయాణమంటే నార్వే దేశానికి వెళ్లాలి. అక్కడ రైలు కంపార్ట్‌మెంట్లు ఇల్లంత సౌకర్యంగా ఉంటాయి. భోజనం ఏది కావాలంటే అది దొరుకుతుంది. అదొక్కటే కాదు రాత్రి మూడు గంటలకు రైలు అద్దాల్లో నుంచి సూర్యోదయం చూడొచ్చు. ఇలా మరెక్కడ సాధ్యం?' అంటారు మోనిషా.

● కాస్త సరదాగా

ర్యాంప్‌పై స్వీట్ వాక్



– మోడల్స్: శ్రీ గులాబ్ జామ్ గారు, శ్రీ మోతిచూర్ లడ్డుగారు...

స్వీట్లు లేని దీపావళిని ఊహించలేము. మరి దీపావళిని పురస్కరించుకొని ఫ్యాషన్ షోలో మిఠాయిలు పాల్గొంటే ఎలా ఉంటుంది? స్వీట్లు ఏమిటి? ఫ్యాషన్ షో ఏమిటి అని ఆశ్చర్యపోతున్నారా? ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) తలుచుకుంటే ఏదైనా సాధ్యమే కదా! ఒక ఏఐ ఆర్టిస్ట్ దీపావళి స్వీట్స్‌కు మోడల్స్‌గా అందమైన రూపాలను ఇచ్చి ఫ్యాషన్ షోలో పాల్గొనేలా చేశాడు. కాజు కట్లీ వయ్యారపు నడకతో ఫ్యాషన్ షో మొదలవుతుంది. ఆ తరువాత శ్రీయుత మిల్క్ కేక్ గారు, మిస్ బర్ఫీ కుమారి గారు, శ్రీమతి మోతిచూర్ లడ్డుగారు కూడా వస్తారు. చీర ధరించి ర్యాంప్ వాక్ చేసిన సోన్ పాపిడీ గారితో షో ముగుస్తుంది. ఆన్‌లైన్ లో షేర్ చేసిన ఈ ఏఐ జనరేటెడ్ వీడియో నెటిజనులలో నవ్వులు పూయిస్తుంది.

● బై మిస్టేక్

'క్యాన్'తార



ఒక పౌరాణిక సినిమాలో ఏదో సీన్‌లో దూరంగా రైలు వెళుతున్న దృశ్యం, మరో సినిమాలో కరెంట్ తీగలు కనిపించడం గురించి సరదాగా మాట్లాడుకుంటారు.

తాజా విషయానికి వస్తే... 'కాంతార' సినిమాలో ఒక సీన్ వైరల్ అయింది.

కాంతార కథ రాజుల కాలం నాటిది. ఆ కాలంలో వాటర్‌క్యాన్‌లు ఉండే ఛాన్స్ లేదు. అయితే ఈ సినిమాలో విందుభోజనాలకు సంబంధించిన ఒక సీన్‌లో దూరంలో వాటర్ క్యాన్ కనిపిస్తుంది. ఇప్పుడు ఈ మోడ్రన్ ప్లాస్టిక్ క్యాన్ ఇంటర్‌నెట్‌లో టాకింగ్ పాయింట్ అయింది.

'ఆ కాలంలో ప్లాస్టిక్ లేనే లేదు. నిజానికి ప్లాస్టిక్ ఎప్పుడు పుట్టిందంటే, ప్లాస్టిక్ పితామహుడు ఎవరంటే' ఇలాంటి జనరల్ నాలెడ్జ్ విషయాలతో పాటు... 'ఫలానా సినిమాలో ఫలాన పొరపాటును మీరు గమనించారా?'లాంటి విషయాలెన్నో సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు.

ఇక ఈ ప్లాస్టిక్ క్యాన్ సీన్‌పై మీమ్స్ సంగతి సరే సరి. 'ఇది బడా బ్లండర్ ఏమీ కాదు. పెద్ద సినిమా అన్నాక చిన్న తప్పులు సహజమే' అని ఒక యూజర్ మూవీ మేకర్స్‌ని సమర్థించాడు.

● లీగల్

మీ మాజీ భార్య భర్తపై మీరు కేసు వేయొచ్చు!

నా భార్య మరొకరితో సంబంధం పెట్టుకొని నా నుంచి విడాకులు తీసుకుంది. విడాకుల కేసులో నేను తనకు ఫలానా వ్యక్తితో వివాహేతర సంబంధం ఉంది అని పేరుతో సహా చెప్పినప్పటికీ, తనకు అలాంటివేమీ లేవని కోర్టును నమ్మించింది. దాంతో నేను పదిలక్షల రూపాయలు భరణంగా చెల్లించవలసి వచ్చింది. మా విడాకులు అయిన 7 నెలలకే తను అదే వ్యక్తిని పెళ్లి చేసుకుంది. తను నా భార్యగా ఉన్నప్పుడు వారు కలిసి తీసుకున్న ఫోటోలు కొన్ని పెళ్లి వీడియోలో పెట్టి ఇంటర్నెట్లో కూడా పెట్టుకున్నారు. నన్ను మానసిక క్షోభకి గురి చేసినందుకు నేను నా మాజీ భార్య ప్రస్తుత భర్తపై కేసు వేయవచ్చా? ఎందుకంటే, ఇటీవలే పేపర్‌లో తైవాన్‌లో భార్య ప్రియుడిపై భర్త కోర్టులో దావా వేయగా కోర్టు అతనికి పరిహారం కూడా చెల్లించమని చెప్పిందని ఒక వార్త చదివాను. మనదేశంలో కూడా అలా చేసే వీలుందా?

- సంపత్, హైదరాబాద్

రెండు వారాల క్రితం ఇలాంటి ఒక కేసు గురించి మన పత్రికలో కూడా సమాధాన రూపంగా చెప్పాను. వివాహేతర సంబంధాలు చట్టరీత్యా నేరాలుగా పరిగణించక పోయినప్పటికీ, సివిల్ దావాలు/పరిహారాలు కోరడానికి భారతీయ చట్టాలలో ఎటువంటి అడ్డంకీ లేదు. మారుతున్న సామాజిక పరిణామాల దృష్ట్యా, వివాహేతర సంబంధాలు ఇకపై సివిల్ కోర్టుకు చేరే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి.

మీరు మీ మాజీ భార్య ప్రియుడి మీద (ప్రస్తుతం ఆమె భర్త) ఖచ్చితంగా కేసు వేయవచ్చు. పరిహారం కూడా కోరవచ్చు. ఇటీవలే ఢిల్లీ హైకోర్టు తన తీర్పులో ఒక భార్య తన భర్త ప్రియురాలిపై వేసిన దావా చెల్లుతుంది అని పేర్కొంది. అయితే మీరు కేసు వేసిన తర్వాత, మీ మాజీ భార్యకి, తన భర్తకి సంబంధం ఉండేదనే విషయాన్ని ఖచ్చితమైన సాక్ష్యాధారాలతో రుజువు చేయవలసి ఉంటుంది. కోర్టును ఎవరు ఆశ్రయిస్తే వారే తమ పక్షం వాదనని వాస్తవాలేనని రుజువు చేసుకోవాల్సి ఉంటుంది! కేవలం గతంలో వారిద్దరూ కలిసి తీసుకున్న కొన్ని ఫొటోల ఆధారంగా మాత్రమే మీరు కేసు గెలవడం కొంత కష్టమే! అయితే, అసలు మీ మాజీ భార్యకు అతనితో పెళ్లికి ముందు పరిచయమే లేదు అతను ఎవరో నాకు తెలియదు'' వంటి సమాధానాలు చెప్పి ఉన్నట్లయితే, మీ డైవర్స్ కేసులో జరిగిన వాదోపవాదాలను ఆధారంగా తీసుకొని మీ తరఫు సాక్ష్యాలుగా కూడా కోర్టు ముందు ఉంచవచ్చు. ఇవన్నీ ఒకవేళ రుజువు అయినట్లయితే మీకు మానసిక క్షోభ కలిగించినందుకు గాను, ఆర్థికంగా కూడా మీరు నష్టపోయినందుకు గాను, మీరు తగిన పరిహారం పొందే అవకాశం లేకపోలేదు. మీరు కేసు వేయాలి, తగిన సాక్ష్యాధారాలతో రుజువు చేయగలను అనుకుంటే, మీ మాజీ భార్యని కూడా కేసులో పార్టీ చేయండి. ఇంతవరకు ఇలాంటి కేసులు లేకపోయినప్పటికీ, ఇటీవలే మన భారతీయ కోర్టులు ఇచ్చిన తీర్పుల ఆధారంగా మీ కేసు విచారణకు మాత్రం అర్హత సాధించింది. కేసు గెలవడం ఓడిపోవడం తర్వాత సంగతి. అన్ని సాక్ష్యాధారాలు, ముఖ్యంగా మీ డైవర్స్ కేసులో మీ మాజీ భార్య ఇచ్చిన వాంగ్మూలాలు/ క్రాస్ ఎగ్జామినేషన్‌లో తను చెప్పిన సమాధానాలు వంటివి నిక్షిప్తపరిచి ఒక లాయర్‌ను సంప్రదిస్తే మీకు ఉపశమనం లభించవచ్చు.



- శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాల కోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

● వైల్డ్ లైఫ్ ఆర్టిస్ట్

కాంక్రీట్ వనాలు పెరిగిపోతున్న నేటిరోజుల్లో వన్యప్రాణుల మనుగడ ప్రశ్నార్థకం అవుతుందన్నది తెలిసిందే. ఈ క్రమంలో సెల్ఫ్ ఆర్టిస్ట్‌గా పేరొందిన మీరట్ వాసి దీక్షా చౌహాన్ అడవి జంతువుల జీవన వ్యథను, బతుకు పోరాటాన్ని తన హైపర్ రియలిస్టిక్ చిత్రాలతో మన కళ్లకు కడుతోంది. స్థిరమైన ఆదాయాన్ని ఇచ్చే ఇంజినీరింగ్ ఉద్యోగాన్ని వదిలి, చిన్నప్పుడు హాబీగా నేర్చుకున్న పెయింటింగ్‌తో దోస్తీ చేసింది. ఏ టేబుల్ మీద అయితే ల్యాప్‌టాప్‌తో సాఫ్ట్‌వేర్ వర్క్ చేసేదో అదే టేబుల్‌ను కాన్వాస్‌గా మార్చుకుంది. ఐదేళ్లుగా తన బ్రష్ స్ట్రోక్స్‌తో అడవి జంతువులకు గొంతుకగా మారిన దీక్ష పెయింటింగ్ కళ దేశ సరిహద్దులను దాటి ప్రపంచ వన్యప్రాణి ప్రేమికులకు చేరువయింది. ఉపాధితో పాటు ఉపయుక్తమైన మార్గాన్ని ఎంచుకున్న దీక్ష నేడు ఎంతోమంది యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది.



వన్యప్రాణులకు కుంచెతో ప్రాణం



'ఒక కళాకారిణిగా నేను దేనికీ కట్టుబడి లేనట్టు ఎదుటి వారికి అనిపిస్తుంది. కానీ, నేను ప్రతి దానితో కనెక్టివ్‌గా ఉన్నాను. దేనికీ దూరం కాలేదు' అని చెబుతుంది 29 ఏళ్ల దీక్ష చౌహాన్. ఐదేళ్ల క్రితం సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలి, తిరిగి పెయింట్ బ్రష్ పట్టుకుంది. అందమైన సినరీలు, పోర్ట్రయిట్‌లు పెయింట్ చేస్తూ అడవి జంతువులవైపు దృష్టి సారించింది. ఒక ఉన్నతమైన ప్రయోజనాన్ని కలిగించే మార్గాన్ని అన్వేషిస్తూ అడవి జీవుల వ్యథలను చిత్రీకరిస్తూ, వాటికి గొంతుకలా మారింది.

మూలాలకు చేరుకున్న కళ

దీక్ష పెయింట్ బ్రష్ అందుకోవడానికి ముందు సంగీతం, నృత్యం కళలు ఉన్న ఇంట్లో పెరిగింది. కళ ఒక కాలక్షేపానికి కాదు, అది ప్రపంచాన్ని చూపే ఒక మార్గం అని తెలుసుకుంది. ఇంజినీరింగ్ విద్య డిగ్రీకి కొలమానంగా, ఉపాధిని పొందడానికి ఒక మార్గంగా చూపుతున్నప్పటికీ ఒక చోట తనను తాను బంధించుకోలేనని నిర్ణయించుకుంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిగా కెరీర్‌ను కొనసాగిస్తున్న ఆమె కళాకారిణిగా వెనక్కి తిరిగి చూసుకుంది. సంతృప్తిగా సాగుతున్న ఈ కళా ప్రయాణం తనను తన మూలాలకు తిరిగి చేర్చిందనుకుంది.

సృజనాత్మకత పరిరక్షణ

దీక్ష వన్యప్రాణుల చిత్రాలు చాలా వాస్తవికంగా ఉంటాయి. ఆ చిత్రాలను చూసేవారు వెంటనే ఉలిక్కిపడతారు. పులి చూపులు మన మీదకు దూకేలా అనిపిస్తాయి. ఖడ్గమృగాన్ని ఒక సారి తాకి చూద్దాం అనుకుంటారు. పక్షులు ఆకాశం మధ్యలో ఆగిపోయినట్లు కనిపిస్తాయి. అయినప్పటికీ అవన్నీ కదలికలతో సజీవంగా ఉంటాయి. దీక్ష చూపే సున్నితమైన సృజన, సాంకేతిక నైపుణ్యంతో మనల్ని జంతువులతో కనెక్ట్ అయ్యేలా చేస్తుంది. అంతరించిపోతున్న జాతులను రక్షించేందుకు, వాటి ఆవాసాలను సంరక్షించే చొరవకు మద్దతును ఇస్తుంది. దాడికి గురైన మూగప్రాణుల వెతలను కళ్లకు కడుతుంది. ఎన్నో చిత్ర ప్రదర్శనలు, సోషల్ మీడియా, జంతు పరిరక్షకుల సహకారంతో ఆమె తన ప్రతిభను ప్రజలకు చేరవేస్తుంది. మూగజీవాలకు –ప్రజలకు మధ్య వారధిగా తన కళను ఉంచుతుంది. ఆమె కళ జంతుజాలం మనుగడ, దుర్బలత్వం, మనుషుల ప్రమేయం .. ఇలా కథలుగా చూపుతుంది.

ప్రపంచ గుర్తింపు

దీక్ష చేస్తున్న కళా సేవ మన దేశ హద్దులను దాటి ప్రపంచం గమనించేంతగా వెళ్లింది. అన్ని ఖండాలలోని కళారాధకులను చేరుకుంది. కళా సేకరణదారులు, వన్యప్రాణుల రక్షకులు ఆమె సృజనను అర్థం చేసుకున్నారు. జీవ నాణ్యత, మనుగడ, వాటి ఆధారంగా ఉండే లక్ష్యానికి కూడా ఆకర్షితులయ్యారు. ఆమె కాన్వాసులు చాలా మంది చూడని అటవీ ప్రపంచానికి చేరువ చేసింది. స్వరం లేని మూగజీవాలకు తన కళ స్వరం ఇవ్వగలదని దీక్ష నమ్ముతుంది. ఆమె ప్రతి బ్రష్ స్ట్రోక్ ఒక వాదనను వినిపిస్తుంది. ప్రతి పెయింట్ ఒక సందేశాన్ని ఇస్తుంది. ప్రేక్షకులు ఆమె పెయింటింగ్స్ ముందు నిలబడినప్పుడు వారు చిత్రాలను మాత్రమే కాదు దీక్ష కళ్లతో అడవిని వీక్షిస్తున్నారు. అడవి జీవుల కష్టాలను అర్థం చేసుకుంటున్నారు. ఆమె తన స్ట్రోక్స్‌తో మూగజీవాల మనుగడకు పాటు పడేలా చేస్తోంది. ఆమె తన కళ ద్వారా ఉత్కంఠభరితమైన రచనలను కూడా సృష్టిస్తుంది. టాలెంట్‌ను ఇలా కూడా చూపవచ్చు అని ఎంతో మందికి తన కళ ద్వారా రుజువు చేస్తోంది.

బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
అక్టోబర్ 14న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,31,310	1,30,340	1,28,350	1,30,840	1,31,000	1,29,000
బంగారం (22 క్యారెట్లు)	1,18,42	1,17,950	1,17,650	1,21,400	1,20,520	1,18,250
వెండి	1,97,000	1,85,400	2,06,000	1,85,400	1,85,000	2,06,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.